సీతారాముల కల్యాణం చూతము రారండి





వేంపాడులో ముస్తాబయిన రామమందిరం

జగదభి రాముడు సీతమ్మ చేతిని అందుకునే ముహూర్తానికి వేళయింది.. చూడముచ్చటగా సాగే సీతారాముల కల్యాణాన్ని వీక్షించి తరించడానికి భక్త కోటి సిద్ధమవుతోంది. ఆదివారం శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా నలుమూలలా ఉన్న రామాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ పర్వదినాన్ని వేంపాడులో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం సీతారాముల ఉత్సవమూర్తులను మేళతాళాలు, కోలాటాలతో ఊరేగించారు. స్వామివారికి భక్తులు సారె సమర్పించారు. దేవవరం, గొడిచర్ల, నక్కపల్లి, రాజయ్యపేట, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, నెల్లిపూడి, రేబాక, రమణయ్యపేట, నామవరం, ఉపమాక, ఒడ్డిమెట్ట, సిహెచ్ఎల్‌పురం తదితర గ్రామాల్లో రామమందిరాలను విద్యుద్దీపాలు, పూలమాలలతో అలంకరించారు.

- నక్కపల్లి



ఊరేగింపులో కోలాటమాడుతున్న మహిళలు

న్యూస్‌రీల్

ఏయూను సందర్శించిన విదేశీ ప్రతినిధులు



జ్ఞాపిక అందజేస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రిపబ్లిక్ ఆఫ్ అంగోలా రాయబారి ఎక్స్‌లెన్సీ క్లైమెంటే కామెన్హా శనివారం సందర్శించారు. వీసీ ఆచార్య రాజశేఖర్‌ను కార్యాలయంలో కలుసుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాలలో చదువుతున్న అంగోలాకు చెందిన 46 మంది విద్యార్థులకు అద్భుతమైన విద్యా సౌకర్యాలు కల్పించినందుకు క్లైమెంటే కామెన్హా సతీమణి మరియా, మినిస్టర్ కౌన్సిలర్ అబెల్ మావుంగో ఏయూ వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున జ్ఞాపిక అందజేసి సత్కరించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందజేస్తామని ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులు తెలిపారు.

అప్పన్న స్వామికి ముత్యాల తలంబ్రాలు



దేవస్థానం ఈవో సుబ్బారావుకు ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న దాతలు

సింహాచలం : అప్పన్న స్వామి కల్యాణ మహోత్సవానికి ముత్యాల తలంబ్రాలను బహూకరించారు దాతలు. ఈనెల 8న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని గోపాలపట్నానికి చెందిన స్వర్ణ జ్యూయలర్స్ అధినేతలు బాబు, వెంకన్న, సునీల్, బాలాజీ కేజీ 500గ్రాముల ముత్యాల తలంబ్రాలను శనివారం అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన దాత, దేవస్థానం ఈవో కె.సుబ్బారావుకు ముత్యాలను అందించారు.

రామానాయుడు స్టూడియోకు త్వరలో నోటీసులు

మహారాణిపేట: విశాఖలో సురేష్ ప్రొడక్షన్స్‌కు కేటాయించిన భూముల్లో కొంత భూమి దుర్వినియోగం జరిగినట్టు ఆరోపణలు రావడంతో ఆ భూములకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ నోటీసులు జారీ చేయనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మధురవాడ సర్వే నెంబర్ 336/పిలో 34.44 ఎకరాల భూమి సురేష్ ప్రొడక్షన్ కోసం కేటాయించింది. ఎకరానికి రూ.5.2 లక్షల ధర నిర్ణయించింది. ఇక్కడ కొంత భూమిలో రామానాయుడు స్టూడియో నిర్మించారు. మిగిలిన భూముల్లో లేఅవుట్ వేయాలని నిర్ణయించారు. దాని కోసం 2023లో సురేష్ ప్రొడక్షన్ పేరిట వీఎంఆర్డీఏకు, జీవీఎంసీకి దరఖాస్తులు చేశారు. అలాగే భూమి మార్పిడి కోసం వీఎంఆర్‌డీఏకు మరో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎలాంటి అనుమతులు లేకున్నా భూమిని చదును చేసి లేఅవుట్లుగా మార్చేసి ప్లాట్లుగా విభజించే ప్రక్రియ చేపట్టారు. దీనిపై ఫిర్యాదులు ప్రభుత్వానికి వెళ్లడంతో కూటమి సర్కార్ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను నివేదిక ఇవ్వాలని కోరింది. ఆరోపణ వాస్తవమేనని కలెక్టర్ తేల్చడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది.

పీడియాట్రిక్ విభాగం తనిఖీ

నర్సీపట్నం: రాష్ట్ర ఆరోగ్యశాఖ నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింగరావు శనివారం ఏరియా ఆస్పత్రిలోని పిల్లల విభాగాన్ని తనిఖీ చేశారు. పీడియాట్రిక్ వార్డులోని పిల్లల ఓపీ రికార్డు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు సకాలంలో టీకాలు వేయాలన్నారు. 24 గంటలు వార్డులోని పిల్లలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. పీడియాట్రిక్ విభాగంలో అందుతున్న సేవలపై సూపరింటెండెంట్ సుధా శారదను ఆరా తీశారు.

సిరులతల్లికి తులసిపూజ



డాబాగార్డెన్స్ (విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుందరం చిందులు

అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరుల వాహనాలను సీజ్ చేసే ధైర్యం మీకెక్కడిది.. మీకు ఎవరు సమాచారం ఇచ్చారో వారి వివరాలు ఇవ్వండి. తనిఖీలకు వచ్చే ముందు నాకు ఫోన్ చేసి రావాలి.. ఎమ్మెల్యే తాలుకా వాహనాలు అని చెప్పిన తరువాత కూడా మీరు ఎలా కేసు నమోదు చేస్తారు.. ఏం ఇక్కడ ఉద్యోగం చేయాలని లేదా..?

- మైనింగ్ శాఖ జిల్లా అధికారిపై ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అరుపులు, బెదిరింపులు ఇవి



రాంబిల్లి మండలం పంచదార్లలో కొండ దిగువన గ్రావెల్ తవ్వుతున్న పొక్లెయిన్



- మైనింగ్ అధికారిపై జనసేన ఎమ్మెల్యే కేకలు, అరుపులు
- అర్ధరాత్రి సమయంలో కూడా కొండలు పిండి చేస్తున్న గ్రావెల్ దొంగలు
- అక్రమంగా గ్రావెల్ తవ్వుతూ పట్టుబడిన ఎమ్మెల్యే అనుచరులు
- కేసు నమోదు చేసి రెండు టిప్పర్లను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు
- తమ వాహనాలు ఎందుకు సీజ్ చేశావంటూ మైనింగ్ అధికారిపై ఎమ్మెల్యే అరుపులు
- తమ పరిధిలోని అంశం కాదని చెప్పినా వినిపించుకోని ప్రజాప్రతినిధి

సాక్షి, అనకాపల్లి: కూటమి ఎమ్మెల్యేల దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. చెరువులు, కొండలను చెరబడుతున్నారు. చెరువులు, వాగుల నుంచి ఇసుకను.. కొండలు పిండి చేసి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ దండిగా సొమ్ము చేసుకుంటున్నారు. వీరి అక్రమాలకు అడ్డు చెప్పే ఆఫీసర్లపై అధికార మదంతో చెలరేగిపోతున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో గ్రావెల్ దందా వ్యవహారంలో ఇదే తరహా ఘటన చోటు చేసుకుంది. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అనుచరుల అక్రమ గ్రావెల్ దందాను అడ్డుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిపై చిందులు తొక్కడం ఇపుడు వివాదాస్పదమవుతోంది. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను మైనింగ్ విజిలెన్స్ అధికారులు సీజ్ చేయగా.. ఎమ్మెల్యే నేరుగా మైనింగ్ కార్యాలయానికే వెళ్లి వారిపై ఆగ్రహంతో ఊగిపోయారు. తాను అధికార పార్టీ ఎమ్మెల్యేనని.. అక్రమ గ్రావెల్ మైనింగ్‌పై స్థానికులు ఫిర్యాదు చేస్తే తనకు చెప్పకుండా ఎలా వాహనాలు సీజ్ చేస్తారని అధికారులపై ఒంటి కాలిపై లేచారు. ఎమ్మెల్యే ఇష్టానుసారంగా మాట్లాడడంతో కార్యాలయంలో ఉన్న అధికారులు, సిబ్బంది నిశ్చేష్టులై ఉండిపోవడం మినహా నోరు మెదపలేకపోయారు.

పారిశ్రామిక ప్రాంతంలో అక్రమ మైనింగ్ దందా

పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం, రాంబిల్లి మండల పరిసర ప్రాంతాల్లో అక్రమ గ్రావెల్ దందా విచ్చలవిడిగా సాగుతోంది. కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుంది. గెడ్డలు, గుట్టలను, కొండ పోరంబోకు ప్రాంతాల్లోనూ రాత్రి.. పగలు తేడా లేకుండా కొండలను పిండి చేస్తున్నారు. పెద్ద పెద్ద క్రేన్‌లు, పొక్లెయిన్ల సహాయంతో కొండల్ని సైతం తవ్వి అక్కడ నుంచి టిప్పర్ లారీల ద్వారా తరలిస్తున్నారు. అచ్యుతాపురం మండలంలో కొండకర్ల, చోడపల్లి, నడింపల్లి, ఎం.జగన్నాథపురం, మళ్లవరం, ఎర్రవరం, ఉప్పవరం గ్రామాల సమీపంలో.. అలాగే రాంబిల్లి మండలంలో పంచదార్ల, వేల్పూరు, పెదకలవలాపల్లి, కొత్తపట్నం, వైలోవ, లాలంకోడూరు, రాజకోడూరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా గ్రావెల్ దందా సాగుతోంది. ఒక ట్రిప్ గ్రావెల్ లోడ్‌ను సుమారు రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు అమ్ముతున్నారు. అది కూడా దూరాన్నిబట్టి రేటు పెరుగుతూ ఉంటుంది. గ్రావెల్ దొంగలు స్థానిక ప్రజలను మభ్యపెట్టడం, ప్రలోభాలకు గురిచేయడం.. కుదరకపోతే భయపెట్టి అక్కడున్న కొండలను ఆక్రమించుకుని తవ్వేయడం జరుగుతోంది. పదుల సంఖ్యలో భారీ టిప్పర్ లారీలతో గ్రావెల్‌ను తరలిస్తూ రాత్రి వేళల్లో ప్రభుత్వ ఆస్తి కొల్లగొట్టి లక్షల రూపాయలు అక్రమంగా సంపాదించుకుంటున్నారు. అందులో భాగంగానే ఈ నెల 3వ తేదీన రాంబిల్లి మండలంలో పంచదార్ల గ్రామ సమీపంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని వచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నేరుగా వెళ్లి రెడ్‌హ్యాండెడ్‌గా టిప్పర్లు పట్టుకుని సీజ్ చేశారు. ఇవి జనసేన ఎమ్మెల్యే అనుచరులకు చెందినవి కావడంతో గగ్గోలు మొదలైంది.

ఏం ఇక్కడ ఉద్యోగం చేయాలని లేదా..

ఎమ్మెల్యే తాలుకా అని చెప్పినా తన **అనుచరుల మాటను మైనింగ్** విజిలెన్స్ అధి**కారులు పట్టించుకోకపోవడం**తో ఎమ్మెల్యే **సుందరపు విజయకుమార్** అహం దెబ్బతింది. **కేసు నమోదు చేసి..** రెండు టిప్పర్ లారీలను, **ఒక చెయిన్ జేసీబీని** సీజ్ చేయడాన్ని **ఆయన జీర్ణించుకోలేకపోయారు.** కేసు **నమోదు చేసిన రోజునే అన**కాపల్లిలో మైనిం**గ్ కార్యాలయానికి వచ్చి అక్కడ అధికారులపై పెద్దగా అరుపు**లు, కేకలతో **చిందులు తొక్కారు.** 'ఒక అధికార పార్టీ **ఎమ్మెల్యే అనుచరుల వాహనా**లను సీజ్ చేసే ధైర్యం మీకెక్కడిది.. మీకు ఎవరు సమాచారం ఇచ్చారో వారి వివరాలు ఇవ్వండి. మీకు సవాలక్ష మంది ఫోన్ చేస్తారు. అయినా తనిఖీలకు వచ్చే ముందు నాకు ఫోన్ చేసి రావాలి కదా' అంటూ విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే తాలుకా వాహనాలు అని చెప్పిన తరువాత కూడా మీరు ఎలా కేసు నమోదు చేసి సీజ్ చేస్తారంటూ.. మైనింగ్ శాఖ జిల్లా అధికారిపై విజయకుమార్ కేకలేశారు. మీకు ఇక్కడ ఉద్యోగం చేయాలని లేదా..? అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇది తమ పరిధిలోని అంశం కాదని.. స్థానికులు సమాచారం ఇవ్వడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వచ్చి కేసులు నమోదు చేశారని మైనింగ్ అధికారులు చెప్పినా వినిపించుకోలేదు. 'మీకు తెలియకుండా ఇది జరగదు కదా' అంటూ వీరంగం చేశారు.

గ్రూపు రాజకీయం చేస్తే.. ఎమ్మెల్యేపై కూడా చర్యలు

- గీత దాటితే అధిష్టానానికి ఫిర్యాదు చేస్తా
- ప్రతి బుధవారం గ్రీవెన్స్ నిర్వహించకపోతే ఎమ్మెల్యేలను వివరణ కోరతాం
- ప్రొటోకాల్ రగడపై స్పందించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



విలేకరులతో మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట: వ్యక్తిగత ఇమేజ్ కోసం తన ఉనికిని కాపాడుకోవడానికి పలు పార్టీలు మారే అవకాశవాదులు గ్రూపు రాజకీయాలు చేస్తే సహించేది లేదని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఇటీవల బుచ్చెయ్యపేటలో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు మండల టీడీపీ కార్యకర్తల విస్తృత సమావేశం ఏర్పాటు చేసి జిల్లా టీడీపీ అధ్యక్షునిగా ఉన్న తనకు సమాచారం ఇవ్వకపోవడమే కాక ఫ్లెక్సీలో తన ఫొటో వేయకపోవడంపై తాతయ్యబాబు స్పందించారు. విజయవాడ నుంచి వచ్చిన ఆయన శనివారం తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశ ఫ్లెక్సీలో పార్టీ జిల్లా అధ్యక్షునిగా ఉన్న తన పేరును, ఫొటోను వేయకపోవడం ప్రొటోకాల్‌కు విరుద్ధమన్నారు. కొంతమంది ఎన్నికల ముందు పార్టీలు మారి గెలిచిన పార్టీలో చేరి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వారి ఆటలు సాగనీయబోమని, మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరగనీయమన్నారు. గ్రూపు రాజకీయాలు చేస్తే ఎమ్మెల్యేలపైన కూడా చర్యలు తీసుకునేలా అధిష్టానం దృష్టికి తీసికెళ్తామన్నారు. ప్రతి బుధవారం ఎమ్మెల్యే తన పరిధిలోని మండల కేంద్రంలో గ్రీవెన్స్ నిర్వహించి ఉదయం ప్రజల సమస్యలు, మధ్యాహ్నం పార్టీ కార్యకర్తల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్ నిర్వహించకుండా ప్రజా సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యేల నుంచి వివరణ తీసుకొని అధిష్టానానికి సమాచారం అందిస్తున్నామన్నారు. నాయకులు దొండా నరేష్, సయ్యపురెడ్డి మాధవరావు, మేడివాడ రమణ, శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, గురుమూర్తి, శంకరరావు తదితర్లు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు, శ్యామ్‌ప్రసాద్ తదితరులు

సీతంపేట (విశాఖ): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతిపౌరుడు తెలుసుకోవాలని మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం మనకు ప్రసాదించిన సమానత్వపు హక్కులను కాపాడాల్సిన బాధ్యత హ్యూమన్‌రైట్స్ డిఫెండర్లపై ఉందన్నారు. సీనియర్ న్యాయవాది, కౌన్సిల్ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చట్టం ద్వారా మనకు కల్పించబడిన స్వేచ్ఛ, బాధ్యతలు అంటే సమాజానికి సేవ చేయాల్సిన బాధ్యతగా పేర్కొన్నారు. మాజీ పోలీస్ అధికారి సీహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ పౌరులందరికీ సమానత్వపు హక్కు, స్వేచ్ఛా హక్కు, దోపిడీ నుంచి రక్షణ, మత స్వేచ్ఛ, విద్యా హక్కు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వి.రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మతం, భాష సంస్కృతి కాపాడుకునే హక్కు ఉందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సభ్యులు గుండు అప్పలరాజు, మాజీ పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొని మానవహక్కుల కౌన్సిల్ 26 ఏళ్లుగా చేస్తున్న సేవలను ప్రశంసించారు.

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

అనకాపల్లి: నేటి యువత మాజీ ఉప రాష్ట్రపతి బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కలెక్టర్ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన రాష్ట్రమైన బిహార్‌లో షెడ్యూల్డ్ కులంలో జన్మించి చదువే ఆయుధంగా చేసుకొని అత్యంత ఉన్నత స్థానానికి చేరారని, దేశానికి ఎనలేని సేవలు అందించారని ఆమె పేర్కొన్నారు. దేశంలో హరిత విప్లవం అమలు చేయడం ద్వారా స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేసినట్లు ఆమె చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాణ కమిటీ సభ్యునిగా, బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడానికి రిజర్వేషన్లు అమలు చేసినట్లు ఆమె తెలిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ సమాజానికి దిశ దిశ నిర్దేశించారని చెప్పారు. నేడు కార్మికులు అనుభవిస్తున్న హక్కులు కార్మిక శాఖ మంత్రిగా ఆయన కృషి ఫలితమేనని తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. జేసీ జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజేశ్వరి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు రేబాక మధుబాబు, అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబూ తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు

శుక్రవారం

	గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి :	35.9/23.8

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పొడిగా ఉండి, అక్కడక్కడ చెదురు పాటి వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



చీడిక కొత్తూరులో నేలకొరిగిన అరటి తోటలు, గెలలు

- ధ్వంసమైన అరటి తోటలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నక్కపల్లి: శనివారం సాయంత్రం వీచిన బలమైన ఈదురుగాలులకు పలు గ్రామాల్లో అరటి, మామిడి, జీడి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. సాయంత్రం విపరీతమైన ఈదురు గాలులు వీచాయి. చీడిక కొత్తూరులో నర్సింగరావుకు చెందిన సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో వేసిన అరటి పంటకు నష్టం వాటిల్లింది. గాలులకు అరటి చెట్లు నేలకూలిపోయాయి. అరటి గెలలు పక్వానికి రాకముందే నేలకొరిగి పోవడంతో తీవ్రనష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. డొంకాడ, సీతానగరం, రమణయ్యపేట, రేబాక, చీడిక, కొత్తూరు, తదితర గ్రామాల్లో వేసిన బొప్పాయి చెట్లు కూడా నేలకూలాయి. పిందె దశలో ఉన్న మామిడికి కూడా నష్టం వాటిల్లిందని, మామిడి కాయలు నేలరాలాయని రైతులు చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి: ఈదురు గాలులతో కూడిన వర్ష బీభత్సానికి మండలంలోని పది గ్రామాలలో 21 విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతోపాటు మూడు లక్షల మేర నష్టం జరిగి ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్తపెంట కోనేరు వద్ద విద్యుత్ తీగలపై తాటిచెట్టు పడిపోవడంతో ఐదు విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. వేచలం చీకటితోట వద్ద 4 స్తంభాలు, ఎస్.గజపతినగరంలో 2, వేచలం గ్రామంలో 4, కలిగొట్ల శివారు బందారుపాలెంలో 2, బి.కింతాడ కొత్తూరులో 4 స్తంభాలు పడిపోయాయి. ఎలక్ట్రికల్ ఏఈ కర్రి శంకరరావు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.



కొత్తపెంటలో నేలమట్టమైన విద్యుత్ స్తంభం

విద్యుత్ షాక్ తగిలి రైతు సజీవదహనం


తాతబ్బాయి (ఫైల్)


సజీవ దహనమైన తాతబ్బాయి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

నక్కపల్లి : మండలంలోని జానకయ్యపేటలో విద్యుత్ షాక్ తగిలి ఈగల తాతబ్బాయి(80) అనే రైతు సజీవ దహనమయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈగల తాతబ్బాయి శనివారం ఉదయం తన కొబ్బరి తోటకు వెళ్తుండగా ఇదే గ్రామానికి చెందిన దేవర కృష్ణ తోటలో తాటిచెట్టు కరెంటు తీగలపై పడడంతో తోటలోకి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైర్లు తెగి కాలిబాటలో పడ్డాయి. వీటిని గమనించకుండా వెళ్లిన తాతబ్బాయి తెగి పడిన వైర్లను కాలితో తొక్కడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తీగలనుంచి మంటలు వ్యాపించి తాతబ్బాయి శరీరం పూర్తిగా కాలిపోయింది, దీంతో అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సర్పంచ్ సింహాచలం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కురందాసు నూకరాజు, ఎస్‌ఐ సన్నిబాబులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద విషయాన్ని తెలుసుకున్నారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. తెగిపడిన విద్యుత్ తీగల వల్ల మృత్యువాత పడిన తాతబాబ్బయి కుటుంబాన్ని ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్తులు, మృతుని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నరసింగబిల్లిలో బాలిక ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న బ్యూల (ఫైల్)

కశింకోట : నరసింగబిల్లిలో ఒక బాలిక ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకొంది. సీఐ అల్లు స్వామినాయుడు శనివారం అందించిన వివరాల ప్రకారం..నరసింగబిల్లిలోని జంగాల కాలనీలో నివాసం ఉంటున్న పిల్లిబోయిన బ్యూల (15) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరిపోసుకొని శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై ఫిర్యాదు అందడంతో ఎస్‌ఐ లక్ష్మణరావు సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శనివారం పోస్టుమార్టం జరిపించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలు ఇటీవల టెన్త్ పరీక్షలు రాసింది. నూతలగుంటపాలెం శివారు త్రిపురవానిపాలెం గ్రామానికి చెందిన ఆమె తల్లి దుర్గ, తండ్రి కూలి పని చేసుకుంటూ నరసింగబిల్లిలో పదేళ్లుగా నివాసం ఉంటున్నారు. వీరు ఎప్పటిలాగే కూలి పనికి వెళ్లిపోయాక ఇంట్లో ఎవరూ లేని సమయంలో బ్యూల ఆత్మహత్యకు ఒడిగట్టింది. ఇందుకు స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. అయితే ఇంటి పక్కన ఉన్న ఓ యువకుడు ప్రేమ పేరుతో కొంత కాలంగా వేధిస్తుండడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. ఆ యువకుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు సమాచారం. దీంతో ఆ కోణంలో ఆత్మహత్య సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి ఒక సోదరుడు ఉన్నారు. తండ్రి వరహాలబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీడీఆర్ బాండ్లు వద్దు...నగదే కావాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక : మాకు టీడీఆర్ బాండ్లు వద్దు...నగదే ముద్దు అంటూ పలువురు నిర్వాసితులు నినదించారు. పూడిమడక రోడ్డు విస్తరణలో భూములు, గృహాలు కోల్పోతున్న బాధితులు శనివారం మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో సమావేశమయ్యారు. రోడ్డు పొడవునా ఉన్న నిర్వాసితులంతా ముక్తకంఠంతో టీడీఆర్ బాండ్లు వద్దంటూ నినదించారు. గ్రామసభల ద్వారా అధికారులు ప్రకటించిన విధంగానే నేరుగా నగదు అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. తమకు మరో ప్రత్యామ్నాయం అవసరం లేదని ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. నిర్వాసితుల సంఘ జేఏసీ నాయకుడు ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రహదారి విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అయితే గ్రామసభల ద్వారా ప్రకటించినట్టు పరిహారాన్ని నేరుగా నిర్వాసితుల అకౌంట్‌లో జమ చేయాలన్నారు. ప్రతి బాధితుడు తమకు టీడీఆర్ బాండు వద్దంటూ వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తగు న్యాయం చేయాలన్నారు. అనంతరం జేఏసీ సభ్యులంతా గ్రామాల్లో జరగనున్న సభల్లో టీడీఆర్ బాండ్లను వ్యతిరేకించాలని నిర్ణయించారు. సమావేశంలో నిర్వాసితులు భీమరశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేడ రామచంద్రరావు,ఏవీ సత్యనారాయణ,పెంటకోట జగన్నాధరావు మాష్టారు,పాలమరశెట్టి అప్పలనాయుడు,బొద్దపు శ్రీరామమూర్తి,బొడ్డేడ సింధూ మాష్టారు.ఆడారి శ్రీరాములు,విల్లూరి జగన్నాధరావు పాల్గొన్నారు.





బాంబు పేలుళ్లు.. గన్ ఫైరింగ్‌లు





దువ్వాడలో యుద్ధ వాతావరణం

సాక్షి, విశాఖపట్నం: శనివారం మధ్యాహ్నం.. ఒక్కసారిగా బాంబు పేలింది.. అంతలోనే గన్ ఫైరింగ్ వినిపించింది.. బుల్లెట్ల వర్షం కురిసింది.. అక్కడ వ్యాపించిన పొగల నుంచి సైనికులు భారీ రైఫిల్స్ పట్టుకొని ఒక్కసారిగా బయటికి వచ్చారు. ఇక్కడేదైనా యుద్ధం జరుగుతోందా అనే అనుమానాలతో దువ్వాడ సమీప ప్రజల్లో ఆందోళన మొదలైంది. అది టైగర్ ట్రయాంఫ్-2025 విన్యాసాల్లో భాగంగా జరుగుతున్న కార్యాచరణ అని తెలిసి ఊపిరిపీల్చుకున్నారు. మూడు రోజుల పాటు దువ్వాడ ఫైరింగ్ రేంజ్‌లో భారత్, అమెరికా దేశాల సైనికుల మధ్య ఉమ్మడి శిక్షణ కార్యక్రమం జరిగింది. చివరి రోజున యుద్ధ వాతావరణంలో ఇరుదేశాలు పరస్పర సహకారం అందించుకుంటూ.. శత్రుసేనలను మట్టుబెట్టాలనే అంశంపై విన్యాసాలు నిర్వహించారు. ఇదే సమయంలో యుద్ధం జరిగినప్పుడు.. ఓవైపు శత్రువులతో పోరాటం చేస్తూనే.. మరోవైపు గాయపడిన తోటి సైనికులకు వైద్య సహకారం అందించేందుకు ఏ విధమైన కార్యాచరణ సంసిద్ధం చేయాలన్నదానిపైనా శిక్షణ కార్యక్రమం జరిగింది. సుదర్శన్ చక్ర కార్ప్స్ నేతృత్వంలో బైసన్ డివిజన్ యాంఫీబియస్ బ్రిగేడ్‌కు ప్రాతినిధ్యం వహించిన 8 గూర్ఖా రైఫిల్స్ ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ గ్రూప్, 5వ పదాతిదళ రెజిమెంట్‌లోని 1వ బెటాలియన్ (బాబ్‌క్యాట్స్), ఒకటో స్ట్రైకర్ బ్రిగేడ్ పోరాట బృందం, 11వ పదాతిదళ విభాగం (ఆర్కిటిక్ వోల్ఫ్స్) సిబ్బందితో కూడిన భారత ఆర్మీ బృందాలు ఈ ఉమ్మడి విన్యాసాల్లో పాలుపంచుకున్నాయి. భారత్, యూఎస్ సైనికులు 100 మీటర్ల నుంచి లైవ్-ఫైరింగ్ డ్రిల్‌లు, 50 మీటర్ల వద్ద క్లోజ్-క్వార్టర్స్ కంబాట్ షూటింగ్, దట్టమైన అటవీ భూభాగంలో పరస్పర కమ్యూనికేషన్ ద్వారా కదలికలు, జంగిల్ లేన్ షూటింగ్ మొదలైన విన్యాసాలు చేపట్టారు.

కార్పొరేట్ సేవలో కూటమి ప్రభుత్వం

- పేదలకు, నిర్వాహితులకు ద్రోహం
- సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

అనకాపల్లి : జిల్లాలో మిట్టల్ నిస్సాన్ స్టీల్‌ప్లాంట్‌కు ఆమోదం తెలపడంతో పాటు నక్కపల్లి మండలం డీఎల్ పురం వద్ద 2.9 కిలో మీటర్ల వాటర్ ఫ్రంట్‌తో ఒక క్యాప్టివ్ పోర్టుకు, ఆదే ప్రాంతంలో 2,164 ఎకరాల భూములను సేకరించి మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెల్పడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూములు సేకరించిన నిర్వాసితులకు నేటికీ పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ, పునరావసం కల్పించకుండా వారిని అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ఏకపక్షంగా అనుమతులు ఇవ్వడమంటే నిర్వాసితులకు ద్రోహం చేయడమేనని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ సేవలో మునిగి తేలుతున్న కూటమి ప్రభుత్వానికి పేద ప్రజల సమస్యల పరిష్కరించడంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ముడి ఇనుప గనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనం, రూ. 18వేల కోట్లు ప్యాకేజీ సమస్యను పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పాడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, ఎటువంటి పన్నులు, విద్యుత్ రాయితీలు కల్పించకుండా ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు కూటమి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించడమంటే రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. రాంబిల్లి మండలం గోరపూడి గ్రామంలోని ఏపీ రాంబిల్లి ఫేజ్-2లో 5వేల కోట్లతో బల్క్‌డ్రగ్ పరిశ్రమలకు భూములు కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం అన్యాయమని, పరిశ్రమల ఏర్పాటు కొరకు సేకరించిన భూముల నిర్వాసితులకు నేటికీ పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వలేదని ఆ ప్రాంతమంతా తీవ్ర కాలుష్యకోరల్లో చిక్కుకున్నాయని పేర్కొన్నారు. నిర్వహితులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం, ప్యాకేజీ, ఉపాధి అవకాశాలు కల్పించిన తరువాతే పరిశ్రమలకు కూటమి ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వివాహిత మృతి


ఝాన్సీ (ఫైల్)

సబ్బవరం: మండలంలోని సబ్బవరం కొత్త రోడ్డు సమీపాన గొర్లివానిపాలెం రోడ్డులో ద్విచక్ర వాహనం నుంచి జారిపడిన ఘటనలో కె.కోటపాడుకు చెందిన ఓ వివాహిత మృతి చెందింది. స్థానిక సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలిలా.. కె.కోటపాడుకు చెందిన కళ్యాణం ఝాన్సీ(23) తన భర్త మరిడయ్య, ఇద్దరు పిల్లలు డేవిడ్(6), జీవన్‌కుమార్(4)తో కలిసి సబ్బవరంలోని బుడగజంగాల కాలనీలోని తన అమ్మగారి ఇంటికి నాలుగు రోజుల కిందట ద్విచక్ర వాహనంపై వచ్చింది. తిరిగి స్వగ్రామం కోటపాడుకు వెళ్తుండగా.. గొర్లివానిపాలెం రోడ్డులోని నూకాలమ్మ ఆలయ సమీపంలో ద్విచక్ర వాహనం పైనుంచి జారిపడటంతో ఝాన్సీకి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగు రోజుల కిందట జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం మృతి చెందింది. ఝాన్సీ తండ్రి రాజుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మునగపాక : మండలంలోని మల్లవరం దరి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకొని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మునగపాకకు చెందిన రేషన్‌డిపోకు సంబంధించిన 1400 కిలోల బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సివిల్ సప్లయి డీటీ రాజేశ్వరి శనివారం మల్లవరం సమీపంలో తన సిబ్బందితో కలిసి దాడి చేసింది. ఈ దాడిలో 1400 కిలోల రేషన్ బియ్యం గుర్తించి ఇందుకు కారకులైన నలుగురు వ్యక్తులపై మునగపాక పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేశారు. బియ్యం విలువ సుమారు రూ.58,800 ఉంటుందని అంచనా వేశారు.

అవిశ్వాసం వీగిపోతుంది

- జీవీఎంసీలో కూటమికి బలం లేదు
- అయినా అవిశ్వాసం పెట్టేందుకు కుట్రలు
- నిబంధనలకు అనుగుణంగా కలెక్టర్ వ్యవహరించాలి
- మరో ఏడాదిపాటు మేయర్‌గా హరివెంకటకుమారి కొనసాగుతారు
- మీడియాతో మాజీ మంత్రి అమర్‌నాథ్


మాట్లాడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ మేయర్‌పై కూటమి పార్టీలు పెట్టిన అవిశ్వాసం వీగిపోనుందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ధీమా వ్యక్తం చేశారు. జీవీఎంసీలో కూటమి పార్టీలకు తగిన సంఖ్యాబలం లేకున్నా అవిశ్వాసం నోటీసులు ఇచ్చారని, దీనికి ఈ నెల 19వ తేదీన అవిశ్వాస తీర్మానానికి తెరపడనుందన్నారు. మరో ఏడాది పాటు జీవీఎంసీ మేయర్‌గా హరి వెంకట కుమారినే కొనసాగనున్నారన్నారు. శనివారం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరగకుండా తీర్మానం చేసినట్టు కార్పొరేటర్లకు ఎలా నోటీసులు ఇస్తారని కలెక్టర్‌ను ప్రశ్నించారు. అయితే ఈ ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగానే కలెక్టర్/ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ హరేందిర ప్రసాద్ వ్యవహరించాలని సూచించారు. ప్రజాబలంతో నెగ్గి వైఎస్సార్‌సీపీ మేయర్ పీఠాన్ని దక్కించుకుందని, అలాంటి మేయర్‌పై కూటమి పార్టీలకు తగిన సంఖ్యా బలం లేకున్నా అప్రజాస్వామికంగా పెట్టే అవిశ్వాసానికి కుయుక్తులు పన్నుతోందన్నారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా మా కార్పొరేటర్లు లొంగలేదు.. ఎందుకంటే అది జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానమని స్పష్టం చేశారు. ఇప్పటికే స్థానిక ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేయాలని చూసినా అవి ఫలించలేదన్నారు.

దేశాభివృద్ధిలో సముద్ర రంగం కీలకం


మారిటైమ్ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ డా.అంగముత్తు, పోర్టు అధికారులు

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచ వాణిజ్యంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధిలో సముద్ర రంగం ముఖ్య భూమిక పోషిస్తోందని విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) చైర్మన్ డా. ఎం. అంగముత్తు అన్నారు. 62వ నేషనల్ మేరీటైమ్ దినోత్సవం పోర్టులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా. ఎం. అంగముత్తు, సముద్రరంగంలో విధులు నిర్వర్తించిన వారి త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళి అర్పించారు. అనంతరం పోర్ట్ టగ్ ఫ్లోటిల్లా ఇచ్చిన గౌరవ వందనం స్వీకరించారు. చైర్మన్ మాట్లాడుతూ.. నౌకాయాన, సముద్ర రవాణా రంగాలు దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, అంతర్జాతీయ స్థాయికి సామర్థ్యాన్ని పెంపొందించడంలో విశాఖపట్నం పోర్ట్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మేరీటైమ్ డే సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే, కోస్ట్‌గార్డ్ డీఐజీ రాజేశ్ మిత్తల్, హెచ్‌ఐఎంటీ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్‌తో పాటు పోర్ట్ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్ 2లో మెరిసిన ఆణిముత్యాలు


తల్లితో రవి


సిద్దా రవి ప్రసాద్

రావికమతం : మండలంలో మర్రివలస , గుమ్మాలపాడు గ్రామాలకు చెందిన ఎలిశెట్టి రవి, సిద్దా రవి ప్రసాద్ ఇద్దరూ గ్రూప్ 2 పరీక్షల్లో 300 మార్కులకు 230 మార్కులు సాధించారు. పేదింటిలో పుట్టిన ఈ యువకులు స్వయంకృషితో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించి త్వరలో ప్రభుత్వ కొలువులో చేరనున్నారు. మర్రివలస గ్రామానికి చెందిన రవి తండ్రి వరహాలు కొన్నేళ్ల కిందట మరణించారు. తల్లి పాప కూలి పని చేస్తూ రవిని కష్టపడి చదివించింది. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు మంచి మార్కులతో పాసయ్యారు. కాకినాడ సూరంపాడు ఆదిత్యలో టెస్ట్ రాసి ఈ ఏడాది ఫిబ్రవరి 23న జరిగిన గ్రూప్2 పరీక్ష రాశారు. అలాగే గుమ్మాలపాడు గ్రామానికి చెందిన రవి ప్రసాద్ పదో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివి 10 బై 10 మార్కులు సాధించి ట్రిబుల్ ఐటీలో సీటు సాధించారు. ఆపై విప్రో కంపెనీలో ఉద్యోగం చేస్తునే గ్రూప్ 2 పరీక్షలు రాశారు. శుక్రవారం రాత్రి ఫలితాలు విడుదల కావడంతో ఇరువుకి 300 మార్కులగాను 230 మార్కులు సాధించి సత్తా చాటారు.ఇరువురిని ఆయా గ్రామాల పెద్దలు,యువకులు అభినందించారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో విఫలం

- నల్లబ్యాడ్జీలతో దివ్యాంగుల నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం సభ్యులు

అనకాపల్లి: జిల్లాలో దివ్యాంగుల హక్కుల చట్టం -2016ను తక్షణమే అమలు చేయడంలో జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ విమర్శించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను ప్రజల ప్రాణాలు హరించేలా మార్చారన్నారు. శనివారం స్థానిక నెహ్రూచౌక్ సంఘం కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులు ధరించి దివ్యాంగులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో దివ్యాంగులు తమ సమస్యలు పరిష్కారం కోసం వ్యయప్రయాసలకు ఓర్చి కలెక్టరేట్‌కు వెళ్తే నిరుత్సాహమే ఎదురవుతుందన్నారు. అక్కడ అర్జీలు తీసుకునే అధికారులు లేకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో దివ్యాంగులకు లిఫ్ట్ అనుకూలంగా లేదని, కనీసం వీల్ చైర్ పట్టదని వాపోయారు. ఎండలో ఉండలేక రెండో అంతస్తులో కలెక్టర్ వద్దకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మెట్ల స్థానంలో ర్యాంపులు ఏర్పాటు చెయ్యలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దాహం వేస్తే కనీసం తాగునీరు సౌకర్యం కల్పించలేదన్నారు. దివ్యాంగులకు ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్ అనకాపల్లి గాంధీనగర్‌లో ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. అంతకుముందు బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు మంత్రి శ్రీనివాసరావు, ముక్కా గణేష్, కరణం శివ, గెంజి కనకరాజు, ఎం. వి. ఎన్. సత్యనారాయణ, బొట్ట సంతోష్, కాండ్రేగుల నూక అప్పారావు, చెట్టుపల్లి శ్రీనివాసరావు, దూళి శివ, పచ్చిపాల నర్సింగరావు, మొల్లి తాతారావు, ఎండపల్లి శ్రీనివాసరావు, ఈశ్వరరావు, త్రినాథ్, బండా సింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రోయిన్లకు మరమ్మతులు చేయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని శారదానదికి ఆనుకున్న గ్రోయిన్లకు తక్షణమే మరమ్మతులు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరాలశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రోయిన్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రోయిన్లకు ఆనుకున్న పిల్ల కాలువలో పూడికలు తీయాలన్నారు. కార్యక్రమంలో మత్తుర్తి సూరిబాబు, కోన లక్ష్మణ పాల్గొన్నారు.

13న పక్షులకు తిండి గింజలు

అనకాపల్లి: వేసవి దృష్టిలో పెట్టుకుని ఈ నెల 13న పక్షులకు తిండి గింజలు (వరి కుంచులు) తాగునీరు ఉంచే మట్టిపాత్రలు, పక్షుల గూళ్లు పట్టణ పరిధిలోని పార్కుల్లో ఏర్పాటు చేస్తామని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో గొంతు తడుపుకునేందుకు పక్షుల కోసం మీ ఇంటి బయట కాసిన్ని నీళ్లు, గుప్పెడు గింజలు ఉంచాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమస్త జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

వేతనాలు పెంచాలని డిమాండ్



దీక్షలలో పాల్గొన్న క్వారీ, క్రషర్ కార్మికులు

అనకాపల్లి టౌన్: పనికి తగ్గట్టుగా వేతనాలు పెంచాలని జిల్లా క్వారీ, క్రషర్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బవులవాడ పంచాయతీ దర్జీనగర్‌లో క్వారీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శానాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, ఏ అప్పలనాయుడు, చవితిన నూకరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి పట్టణం, మండలం, కశింకోట మండలం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అనకాపల్లి సీడీపీవో పి. ప్రభావతి తెలిపారు. జీవీఎంసీ 80వ వార్డు మాదిగ దిబ్బ, 82వ వార్డు పూడిమడక రోడ్డు, బర్మా కాలనీ, మండలంలోని మెట్టపాలెం, కేటీపీ పాలెం, కోడూరు, బవులువాడ, సీతానగరం, కశింకోట మండలంలోని రౌతు వీధి కేంద్రాలకు 10వ తరగతి పాసైన వివాహితులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 4,113 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
మొదటి రకం	3,550	4.170
రెండో రకం	3,130	3,760
మూడో రకం	2,870	3,100

అనకాపల్లి సినిమాలు

రాజా	:మ్యాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
సత్యనారాయణ స్క్రీన్-2	:రాజుగారి దొంగలు
పర్తిసాయి	:కోర్టు
షిర్డీసాయి	:లైఫ్
వెంకటేశ్వర	:ఆదిత్య 369
శ్రీసత్య	:సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	:వీరధీరశూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 315 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 256 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త



పట్టణంలో నిర్మానుష్యంగా రహదారి

భానుడి విజృంభణకు ప్రజల బెంబేలు

ఉదయం 10 దాటితే రహదారులు నిర్మానుష్యం

వడదెబ్బకు గురికాకుండా గ్రామాల్లో అవగాహన



అనకాపల్లి: భానుడు భగభగలకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణ, మండల పరిధిలో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడి పనులు వాయిదా వేసుకుంటున్నారు. అత్యవసర సమయంలో రోడ్లపైకి వచ్చే వారు తప్పనిసరిగా గొడుగులు, తాగునీరు వెంట తీసుకెళ్లాలని వైద్యులు చెబుతున్నారు. ఉదయం 10 లోపు సాయంత్రం 3 గంటల తర్వాత మాత్రమే రహదారులపై వెళ్లాలని సూచిస్తున్నారు. ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత కూడా పెరిగి (104.9) మెదడు మీద ప్రభావం చూపుతుంది. దీని వల్ల మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం(హైపోథలామస్) దెబ్బతిని వడదెబ్బకు గురి కావలసిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనినే హీట్ స్ట్రోక్ లేదా సన్‌స్ట్రోక్(వడదెబ్బ) అంటారు. ప్రమాదకరం, ప్రాణాంతకంగా భావించవచ్చు.

వడ దెబ్బ బారినపడిన వ్యక్తికి ప్రథమ చికిత్సలు...

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి తీసుకుని వెళ్లాలి.
- చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలాగే చేస్తుండాలి.
- ఫ్యాన్ల గాలి, చల్లని గాలి తగిలేలా ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం తాగించాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. దగ్గరలో ఆస్పత్రికి తీసుకుని వెళ్లాలి.

వడదెబ్బ లక్షణాలు...

చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణకు పుట్టడం, మత్తు నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితి, శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం.

వడదెబ్బకు ఎక్కువగా గురయ్యే వ్యక్తులు...

65 సంవత్సరాలు పైబడిన వ్యక్తులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పసిపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు,



తుమ్మపాలలో వడ దెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వడ దెబ్బ వల్ల శరీరంలో కలిగే మార్పులు...

వాతావరణపు వేడిమికి శరీరం ఎక్కువసేపు గురికావడం వల్ల చెమట పట్టి శరీరంలోని లవణాలు (సోడియం క్లోరైడ్)తగ్గిపోవడం, శరీరంలో నీటి నిష్పత్తి తగ్గిపోవడం, ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాలలో ఎక్కువ శ్రమతో కూడిన పని చేస్తున్నప్పుడు ప్రతి గంటకు మూడు లేక నాలుగు లీటర్ల నీటిని చెమట రూపంలో మన శరీరం కోల్పోతుంది.

వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు...

- గొడుగు వాడటం, తెలుపురంగు, పలుచటి చేనేత వస్త్రాలను ధరించడం.
- తలకు టోపీ లేదా రుమాలు వాడడం.
- వేడిగాలులు తగలకుండా చూసుకోవడం.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంట మధ్యకాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పని చేయకుండా ఉండడం.
- శీతల పానీయాలు, మంచు ముక్కలు తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్యం ఏర్పడుతుంది.
- ఇంటి నుంచి బయటకి వెళ్లే ముందు ఒక గ్లాసు మంచినీరు తాగడం.
- వీలైనన్ని ఎక్కువసార్లు మంచినీరు తాగడం.
- తీవ్రమైన ఎండలో బయటికి వెళ్లినప్పుడు తల తిరుగుట వంటి అనారోగ్య సమస్యలు ఏర్పడితే సమీపంలో ఉన్న వైద్యున్ని సంప్రదించి, ప్రాథమిక చికిత్స పొందాలి.

వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తం



ఎన్ఆర్‌జీఎస్ కార్మికులు వడ దెబ్బకు గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలులో పలు ప్రాంతాల్లో వడదెబ్బపై ప్రజలకు తమ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎన్ఆర్‌జీఎస్ కార్మికులు ఎండలో పనిచేసే సమయంలో తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు దగ్గరలో ఉంచుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి. తాగునీరు, పండ్ల రసాలు తాగాలి. అత్యవరమైన సమయంలో గొడుగు వెంట తీసుకుని ఎండ నుంచి రక్షణ పొందాలి. వడదెబ్బకు గురైన వ్యక్తి కొన్ని సమయంలో మృత్యువాత పడే అవకాలు ఉన్నాయి.

– వాణి జగదీశ్వరీ, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు, అనకాపల్లి మండలం

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు



బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కశింకోట: దేశానికి ఉప ప్రధానమంత్రిగా, పలు శాఖల మంత్రులుగా పని చేసి విశేష సేవలందించిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక హౌసింగ్ కాలనీ వద్ద గుర్రం జాషువా కాలనీలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి శనివారం కూటమి నాయకులు, దళితులు పూలమాలలు వేసి, క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి అందించిన త్యాగాలను ప్రస్తుతించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు బుదిరెడ్డి మోహనరావు, కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: పేద కుటుంబంలో పుట్టి ఉన్నత స్థాయికి చేరుకున్న బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత తెలిపారు. పట్టణంలోని పలు చోట్ల మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. 80వ వార్డు గవరపాలెం అరుంధతి నగర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 80వ వార్డు ఇన్‌చార్జి కేఎం నాయుడు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ సిద్ధార్థ, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు కాండ్రేగుల హైమ, నాయకులు పెట్ల నాగేశ్వరావు, విల్లూరి సంతోష్, మద్దాల సురేష్, రవిశంకర్, తులసి తదితరులు పాల్గొన్నారు. చోడవరం బస్టాప్ వద్ద జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పాల్గొని దేశానికి బాబూజీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ సోషల్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన్న అప్పారావు, ఎమ్మార్పీఎస్ నాయకుడు కట్టమూరి మంగరాజు, తదితరులు పాల్గొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మారేడిపూడి ఈశ్వరరావు, ముప్పిడి మణికంఠ, అయినవిల్లి శివ సత్యనారాయణ, ములగాడ రవి పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో జగ్జీవన్‌రావ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ నేటి తరానికి ఆదర్శప్రాయుడని, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు, సమానత్వం స్థాపించేందుకు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయాన్ని సుస్పష్టం చేయడంలో కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ నాయకుడిగా, పరిపాలనాధ్యక్షునిగా దేశానికి ఎంతో సేవలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ టి.లక్ష్మి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పలు చోట్ల వర్షం

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా వర్షం కురిసింది. రోడ్లపై నీరు చేరింది. ఒక్కసారిగా మేఘం వేసి వర్షం పడింది. దీంతో కశింకోట వీధుల్లోని రోడ్లు తడిచాయి. ఈ వర్షం వల్ల ఎండలతో సతమతమవుతున్న ప్రజలు వాతావరణం చల్లబడటంతో ఉపశమనం చెందారు.

వర్షం పంటలకు అనుకూలం

తుమ్మపాల: మండలంలో శనివారం సాయంత్రం చల్లని మబ్బుల ఏర్పడి అకాల వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తాపానికి జనం రోడ్లపై తిరగలేకపోయారు. మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడి సాయంత్రం కురిసిన వర్షంతో అందరు సేద తీరారు. ఆకస్మికంగా కురిసిన వర్షంతో రోడ్లపై ద్విచక్ర వాహనదారులు, పొలాల్లో పనులు చేస్తున్న రైతు కూలీలు, మేత కోసం వెళ్లిన పశువులు తడిసిముద్దయ్యాయి. ఈ వర్షం పలు పంటలకు జీవం పోసింది. మెట్ట ప్రాంతాల్లో జీడిమామిడితో పాటు యూకలిప్టస్, సరుగుడు వంటి సాగుకు ఈ వర్షం అనుకూలమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. చిగురు నుంచి పిందెలుగా ఏర్పడుతున్న మామిడి పంటకు మంచి ప్రయోజనంగా పేర్కొంటున్నారు. పశువులకు పొలాల్లో గడ్డి మొలకెత్తుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆవఖండం భూముల్లో ఇళ్ల నిర్మాణాలు

నిలుపుదల చేయాలని పరిరక్షణ సమితి ప్రతినిధులు డిమాండ్



మాట్లాడుతున్న బాలు, సురేష్‌బాబు

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారి ఆవఖండం భూముల్లో ఇళ్ల నిర్మాణాలను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిలుపుదల చేయాలని ఆవఖండం పరిరక్షణ సమితి ప్రతినిధులు గాడి బాలు, కనిశెట్టి సురేష్‌బాబు, సూదికొండ మాణిక్యం, కొణతాల హరనాథ్‌బాబు కోరారు. శనివారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో వారు మాట్లాడారు. ఆవఖండం భూములపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జాతీయ రహదారి బైపాస్ రోడ్డును మించి ఎత్తుగా చేపట్టిన ఫిల్లింగ్ ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. ఆవఖండంలో గృహాల నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులు తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ విషయంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయని, ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించాలని కోరారు. 1990లో అనకాపల్లి పట్టణానికి వచ్చిన వరదలు పునరావృతమైతే పట్టణానికి పెద్ద ప్రమాదం వచ్చే అవకాశం ఉందన్నారు. ఆవఖండం భూముల ద్వారా దిగువ ప్రాంతానికి కొండకర్ల ఆవలోకి, కింద ఉన్నటువంటి భూములకు చుక్క నీరు వెళ్లదన్నారు. పంటలు పండకుండా భూములు నిరుపయోగంగా మారుతాయన్నారు. మండలంలో ఎగువ ప్రాంతాలైన వెంకన్నపాలెం, తుమ్మపాల, శంకరం, రేబాక గ్రామాల ద్వారా వచ్చే వర్షపునీరు పోయే మార్గం లేకుండా పోతుందన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి

నర్సీపట్నం : ప్రజలకు పెనుభారంగా మారిన విద్యుత్ ఛార్జీల పెరుగుదలకు కారణమైన స్మార్ట్ మీటర్లను తొలగించాలని టాక్స్ పేయిర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి డిమాండ్ చేశారు. సీఐటీయు కార్యాలయంలో శనివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇంటి పన్నులు, కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా 15 శాతం నుండి 20 శాతం వరకు ఇంటి పన్నులు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. అనంతరం స్మార్ట్ మీటర్లు తొలగించాలని, ఇంటి పన్ను పెంపు విరమించుకోవాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు గాయత్రి, ఎస్టీ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు ధనార్జున్ పాల్గొన్నారు.

ఘన జీవామృతం తయారీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కశింకోట: మండలంలోని జి. భీమవరం యూనిట్ అడ్డాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం శాఖ ఆధ్వర్యంలో ఘన జీవామృతం తయారీపై రైతులకు శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వంద కిలోల ఆవు పేడ, మూత్రం, బెల్లం, పప్పుల పిండి వగైరా వినియోగించి పిడకలు తయారు చేసి ఎండబెట్టారు. దీన్ని ఎండిన వారం రోజుల తర్వాత పొడిగా చేసి నిల్వ ఉంచి పంటల సాగు సమయంలో భూముల్లో ఎరువుగా వినియోగిస్తారని రైతులకు అవగాహన కలిగించారు. ప్రకృతి సిద్ధంగా తయారైన ఘన జీవామృతాన్ని ఎరువుగా వినియోగించి పంటలు పండించడం వల్ల ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వస్తాయని, వీటిని స్వీకరించడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సీఏ లక్ష్మి, ఎల్-1 రమణ, వెంకట అప్పారావు, నాగలక్ష్మి, ఓబీ ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు



గవరపేట శారదా గణపతి రామాలయంలో సీతారాములు విగ్రహాలు



సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాటు చేసిన వేదిక



షామియానాలు ఏర్పాటు



వేల్పులవీధిలో రామాలయం

కశింకోట: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలకు ఆదివారం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. స్థానిక గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో పెద్ద ఎత్తున సీతారాముల కల్యాణోత్సవాన్ని వేద మంత్రాల నడుమ, శాస్త్రోక్తంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. భద్రాచలం తరహాలో ఇక్కడే కల్యాణం జరుపుతారు. గ్రామంలో ఉదయం సారెతోపాటు ఉత్సవ విగ్రహాలు, కల్యాణ దంపతుల ఊరేగింపు, అనంతరం సీతారాముల విగ్రహాలకు కల్యాణోత్సవం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, మహిళల కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి శారదానదిపై తెప్పోత్సవం, అనంతరం ఊయల సేవ, పుష్పాంజలి, పవళింపు సేవ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, చైర్మన్ భీశెట్టి కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణ వేదిక, షామియానాలు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి వద్ద కోదండ సీతారామచంద్ర మూర్తి స్వామి ఆలయం, కస్పావీధి రామాలయం, పూసర్ల వీధి, కనకమహాలక్ష్మి వీధి, ఎస్సీ కాలనీల్లో రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలతోపాటు పెద్ద ఎత్తున అన్న సమారాధనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వెదురుపర్తి, తాళ్లపాలెం, బయ్యవరం, బంగారయ్యపేట, కన్నూరుపాలెం, జి. భీమవరం, నరసింగబిల్లి, సుందరయ్యపేట, తీడ, చెరకాం, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, సోమవరం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తేగాడ, విసన్నపేట, ఏఎస్ పేట, జమాదులపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, అచ్చెర్ల, గొబ్బూరు తదితర గ్రామాల్లోని రామాలయాల్లోనూ సీతారాముల కల్యాణోత్సవాలు, అన్న సమారాధనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలోని పలు రామాలయాలు శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. వీధి వీధిలో ఆదివారం నిర్వహించే వేడుకలకు ఆలయాల ముందు కొబ్బరి ఆకులతో పందిర్లు వేసి మామిడి తోరణాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయంలో దేవతా మూర్తులకు నూతన వస్త్రాలు ధరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామనామ్నరు. ఉత్సవ విగ్రహాలను పుర వీధులలో ఊరేగించిన అనంతరం రాములోరి కల్యాణం నిర్వహిస్తామని, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు.



మెయిన్‌రోడ్ రామాలయం వద్ద విద్యుత్ అలంకరణ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మెయిన్‌రోడ్ చిన్న బజార్ వద్ద రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఆదివారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం రాముల వారి కళ్యాణం, అనంతరం భారీ అన్న సమారాధన, సాయంత్రం అన్నమాచార్య వాగ్దేయ వరదాయని బృంద సభ్యుల కోలాటం, సాయి నాట్య మండలి శిరీషారాణి శిష్య బృందం శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

తుమ్మపాల: శ్రీరామనవమి పురస్కరించుకుని మండలంలో తుమ్మపాల, కొత్తూరు, పిసినికాడ, కోడూరు, మామిడిపాలెం, బవులువాడ, రేబాక, మార్టూరు, శంకరం, తదితర గ్రామాల్లో రామాలయాలు, హనుమాన్ మందిరాల్లో ఏర్పాట్లు జరిగాయి. సీతారాముల కళ్యాణం ఏర్పాట్లతోపాటు రామాలయాలను రంగులతో సుందరీకరణ, ఆలయ ప్రాంగణాల్లో విద్యుత్ అలంకరణలతో ఉత్సవ కమిటీలు ముస్తాబు చేశారు. ఆదివారం తెల్లవారు నుంచి భక్తులు తరలివచ్చి సీతారాముల కళ్యాణంలో పాల్గొననున్నారు.